క్లుప్తంగా

ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌ను కలిసిన నాయకులు



ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌ను కలిసిన కోరాడ శ్రీను

వీరవాసరం: పాలకొల్లు పట్టణ అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన కోరాడ శ్రీను, యలమంచిలి మండల అధ్యక్షుడిగా నియమితులైన ఉచ్చుల స్టాలిన్ మంగళవారం ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌ను నవుడూరు జంక్షన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పురోభివృద్ధికి నిత్యం కృషి చేయాలని తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కోరాడ శ్రీను, ఉచ్చుల స్టాలిన్‌లకు కవురు శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారు.


నిత్యావసర సరుకుల అందజేత



నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎంపీపీ

వీరవాసరం: పెరికిపాలెం గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వసం కోల్పోయిన బాధితుడు అలవల వెంకటేశ్వరరావు కుటుంబానికి ఎంపీపీ వీరవల్లి దుర్గా భవాని చంద్రశేఖర్, స్థానిక నాయకుల ఆర్థిక సాయంతో మంగళవారం నిత్యావసర సరుకులను అందజేశారు. అలాగే ప్రభుత్వం అందజేసే ఐదు వేల రూపాయలను వారి ఖాతాకు జమ చేస్తామని వీఆర్వో, ఆర్ఐ రూజ్‌వెల్ట్ తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను ఎంపీపీ అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచి కందుల వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచి గెద్దాడ సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి, స్థానికులు పాల్గొన్నారు.

సాయిబాబాకు పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న సాయిబాబా

భీమవరం అర్బన్: మండలంలోని రాయలం గ్రామంలో కొలువైన శ్రీవిజయసాయిబాబా వారి 7వ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం సాయిబాబాకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, గోక్షీరాభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాబాకు వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. కూనపరెడ్డి వెంకట ప్రసాద్ దంపతులు కలశ పూజ, విఘ్నేశ, గౌరి, శని తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాబావారిని గ్రామంలో పురవీధులగుండా త్రిప్పుతూ గ్రామోత్సవం నిర్వహించారు. బుధవారం అఖండ అన్నసమారాధన, సాయంత్రం కోలాటం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.


వేణుగోపాల స్వామికి ప్రత్యేక అలంకరణ



విశేష అలంకరణలో స్వామి వారు

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక బంట్రోతు వారి వీధిలోని శ్రీవేణుగోపాల స్వామి మందిరంలో అక్షయ తృతీయను పురస్కరించుకుని మంగళవారం రాత్రి స్వామి వారికి 108 విసనకర్రలు, 54 మామిడిపళ్లతో అలంకరణ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లండన్‌కు చెందిన వెలువలి ఫణి కిరణ్ దంపతులు, వేదాంత శ్రీకృష్ణ సహకారంతో అర్చకులు కొమ్ము శ్రీనివాస్ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు అంజన్న విగ్రహావిష్కరణ



ఆవిష్కరణకు సిద్ధమైన అభయాంజనేయ స్వామి విగ్రహం

ఆకివీడు: మండలంలోని పెదకాపవరం గ్రామ పొలిమేరలో అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ఈ నెల 30వ తేదీన ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాస్తు, శాంతి, ప్రధాన హోమంలు ప్రారంభించారు. సుమారు 21 అడుగుల అంజన్న విగ్రహంతో పాటు, వినాయకుడు, సుబ్రహ్మణ్యేశ్వరుడి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో స్థానికులు పసుపులేటి వెంకట రమణ, విజయలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థుల భవిష్యత్‌కు భరోసా ఏదీ?

- నియోజకవర్గంలో 585 మంది పదో తరగతి విద్యార్థుల ఫెయిల్
- ప్రత్యేక తరగతులు మేలు చేస్తాయా..
- పిల్లల భవితవ్యంపై ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు



పదో తరగతి పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు (ఫైల్)

ఉండి: గత కొద్ది రోజుల క్రితం వెలువడిన పదో తరగతి ఫలితాల్లో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఫెయిల్ అయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచి ఉన్నత విద్యను అందించాలనే సదుద్దేశ్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థలో ఎన్నో సంస్కరణలు చేపట్టింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని సంస్కరణలు అటకెక్కాయి. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాలు ఆశాజనకంగా రాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు మళ్లీ ప్రైవేట్ పాఠశాలల వైపు చూస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వెల్ ట్రెయిన్డ్, ఉన్నత విద్యావంతులైన ఉపాధ్యాయులు ఉండగా సుమారుగా 60 శాతం మంది విద్యార్థులు మాత్రమే పాస్ కావడం వెనుక అంతరార్థం ఏంటనేది ఉన్నతాధికారులు ఆరా తీయాలని వారు ఆవేదన చెందుతున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో కేవలం డిగ్రీ, ఆపై చదువులు ఉన్న ఉపాధ్యాయులు మాత్రమే చదువుల చెబుతున్నా ప్రతి ఏటా వారికి మాత్రమే మండల ఫస్ట్ ప్లేస్ ఎలా సాధించగలుతున్నారంటూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులను ప్రశ్నిస్తున్నారు.

ఉపాధ్యాయులు పట్టించుకోవట్లేదా?

సరైన విధానంలో విద్యా బోధన జరగడం లేదా. వెనుకబడిన విద్యార్థులపై దృష్టి పెట్టడం లేదా. విద్యార్థుల తల్లిదండ్రుల నిర్లక్ష్యంతో విద్యార్థులు ఫెయిల్ అవుతున్నారా అని పలురకాల అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. విద్యార్థులు ఫెయిల్ అయ్యారంటే దానికి ఎవరిది భాధ్యత? దానికి ఎవరు జవాబుదారీగా వ్యవహరిస్తారు? ఆయా సబ్జెక్టు టీచర్లా లేక పాఠశాల ప్రధానోపాధ్యాయులా? ఎవరు భాధ్యత తీసుకొని విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దుతారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి.

ఆశ్చర్యపరుస్తున్న ఫలితాలు

నియోజకవర్గ వ్యాప్తంగా ఉండి, కాళ్ల, పాలకోడేరు, ఆకివీడు మండలాల వ్యాప్తంగా 2132 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా వారిలో 1547 మంది ఉత్తీర్ణులు అయ్యారు. 585 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. వీరిలో అధికంగా పాలకోడేరు మండలంలో 182 మంది, కాళ్ల మండలంలో 146 మంది, ఆకివీడు మండలంలో 126 మంది, ఉండి మండలంలో 124 మంది చొప్పున ఫెయిల్ అయ్యారు. అత్యధికంగా ఆయా మండలాల్లో ఉండి మండలంలో మహదేవపట్నంలో 35 మంది, ఉండిలో 33 మంది, ఉప్పులూరులో 14 మంది కాగా కాళ్ల మండలంలో ఏలూరుపాడులో 46 మంది, కోపల్లెలో 26 మంది, జువ్వలపాలెంలో 20 మంది ఫెయిల్ అయ్యారు. పాలకోడేరు మండలంలో శృంగవృక్షంలో 39 మంది, మోగల్లులో 35 మంది, విస్సాకోడేరులో 29 మంది చొప్పున ఫెయిల్ అయ్యారు. అలాగే ఆకివీడు మండలంలో ఆకివీడు బాలుర హైస్కూల్‌లో 67 మంది, ఐభీమవరంలో 16 మంది, సిద్ధాపురంలో 10 మంది చొప్పున ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఫెయిల్ అయ్యారు.

క్రమశిక్షణ లోపిస్తుంది

పాఠశాలల్లో క్రమశిక్షణ లోపిస్తుంది. విద్యా బోధనా పద్ధతులు పూర్తిగా మారిపోయాయి. పూర్వకాలంలో ఎంతో హుందాగా ఉండే చదువులు ఇప్పుడు తాత్కాలికంగా మారిపోయాయి. విద్యార్థి పాస్ కాకపోతే దాని భాధ్యతను ఉపాధ్యాయులు ఎందుకు తీసుకోరు. ఫెయిల్ అయిన విద్యార్థుల బాధ్యత ప్రభుత్వమైనా తీసుకోవాలి. – ఫెయిలైన విద్యార్థి తండ్రి, ఉండి

ఉపాధ్యాయులకు బాధ్యత ఉంది

ఉపాధ్యాయులను నమ్మి పాఠశాలకు పంపిస్తే వారు ఇంటి దగ్గర బాగా చదవించండని చెబుతున్నారు. మాకు రెక్కాడనిదే డొక్కాడదు. మాకు చదవులు వస్తే మా పిల్లలకు చెప్పుకుంటాం. మా కంటే వారు బాగుండాలని స్కూల్‌కి పంపుతున్నాం. కానీ చివరకు వారు ఫెయిల్ అయితే మా బిడ్డలకు దిక్కెవ్వరు. – విద్యార్థి తండ్రి, ఉండి

విద్యార్థుల భవితవ్యంపై తల్లిదండ్రుల ఆవేదన

ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నా అవి ఎంత వరకు ఉపకరిస్తాయంటూ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాది కాలంగా విద్యార్థులను నిర్లక్ష్యం చేసి ఇప్పుడు ప్రత్యేక తరగతులు అంటే ఎవరు నమ్ముతారని మరికొందరు ప్రశ్నిస్తున్నారు. అయితే ప్రభుత్వ విద్యా వ్యవస్థ తిరోగమనంలో ఉందా అని మరి కొందరు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్‌కు దీటుగా నిలుస్తున్నా యని అనుకునే సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లో 585 విద్యార్థులు నియోజకవర్గ వ్యాప్తంగా పదో తరగతి ఫెయిల్ కావడం విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన ప్రారంభమైంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఉరకలు వేసిన ప్రభుత్వ పాఠశాలలు కూటమి ప్రభు త్వంలో మాత్రం తిరుగుముఖం పడుతున్నా యని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

ప్రధాని సభకు తరలింపుపై సమీక్ష

భీమవరం (ప్రకాశంచౌక్): మే 2న ప్రధానమంత్రి పాల్గొనే అమరావతి రాజధాని పునః నిర్మాణ పనుల ప్రారంభానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. మే 2న గౌరవ ప్రధాని నరేంద్రమోదీ వస్తున్న క్రమంలో ప్రధాని సభకు వెళ్లేందు ప్రజలకు చేయాల్సిన ఏర్పాట్లపై మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సమీక్షించారు. జిల్లా నుండి 150 బస్సుల్లో 7,500 మంది తరలి వెళ్లేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రవాణా అధికారి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపుపై విమర్శలు తగదు

పాలకోడేరు: పాలకోడేరు శివారు ఏఎస్ఆర్ నగర్‌లో ఆక్రమణల వలన పంట కాలువ కలుషితమై కుముదవల్లి గ్రామ ప్రజలకు సురక్షిత నీరు అందడం లేదని కుముదవల్లి సర్పంచ్ భూపతిరాజు వంశీకృష్ణంరాజు అన్నారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలువల ప్రక్షాళనకు ప్రజా ప్రతినిధులను వేడుకోగా కాలువ వెంబడి స్థలాలను ఆక్రమించుకుని ఇళ్ల నిర్మించుకుని వారు వాడే జలాలను కాలువలోకి వదలడం వలన తాగు, సాగునీరు కలుషితమవుతుందని గుర్తించి, ఆక్రమణలను తొలగిస్తుంటే సీపీఎం నాయకులు రాజకీయం చేస్తూ ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజుపై విమర్శలు చేయడం సరికాదన్నారు. రాజుల కాలువను ప్రక్షాళన చేయాలంటూ పార్టీలకతీతంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు మద్దతు పలుకుతూ నినాదాలు చేశారు. మంతెన సత్యనారాయణ రాజు, భూపతిరాజు శ్రీనివాసరాజు, నాగేంద్ర వర్మ, రమేష్ రాజు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి



ప్రతిభా విద్యార్థులకు నగదు పురస్కారాలు అందించిన దృశ్యం

భీమవరం అర్బన్: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ అన్నారు. మండలంలోని అనాకోడేరు గ్రామంలో మంగళవారం 50 సంవత్సరాల క్రితం పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థి ముదునూరి పాండురంగరాజు అమెరికాలో స్థిరపడి తన కుమార్తె రష్మి పేరిట పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ మాట్లాడుతూ పాండు రంగరాజు తన కుమార్తె రష్మి పేరిట విద్యార్థులను ప్రొత్సహించేందుకు ప్రతిభా పురస్కారాలు అందించడం అభినందనీయమన్నారు. జిల్లాలో సుమారు 12 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తే 1400 పైగా విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారన్నారు. అనంతరం పాఠశాల నుంచి ప్రథమ స్థానం సాధించిన గెద్దం అభినయ్ (542) రూ.10 వేలు, ద్వితీయ స్థానం సాధించిన రావూరి మహిమ తేజస్వీటీ (528)కు రూ.7500, తృతీయ స్థానం సాధించిన యర్రంశెట్టి విజయ మహంకాళమ్మ (515)కు రూ.5 వేలు నగదు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ సుంకర పరమేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు బి.రాధామణి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బొండా వెంకటేశ్వర్లు, వంటా బత్తిన మెర్సీ నిర్మలా కుమారి, ఎంపీటీసీ ఎం.వెంకటేశ్వరరావు, ముదునూరి సూర్యనారాయణరాజు, వనిమ రుద్ర భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యమే లక్ష్యంగా..



మందులను పంపిణీ చేస్తున్న లయన్స్ జిల్లా గవర్నర్

ఆకివీడు: పేదల ఆరోగ్యమే లక్ష్యంగా లయన్స్ క్లబ్‌లు పని చేస్తున్నాయని లయన్స్ జిల్లా గవర్నర్ డాక్టర్ డి.సుబ్బారావు చెప్పారు. స్థానిక లయన్స్ ఆడిటోరియంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య సేవలందించడంలో లయన్స్ అతి పెద్ద సేవా సంస్థగా నిలిచిందన్నారు. ఆకివీడులో లయన్స్ తరఫున పలు శాశ్వత పథకాలు అమలు చేయడం అభినందనీయమన్నారు. లయన్స్ మాజీ గవర్నర్ డాక్టర్ ఎంవీ.సూర్యనారాయణరాజు మాట్లాడుతూ ఆకివీడు లయన్స్ క్లబ్‌లు విద్య, వైద్య సేవలందించడంలో ప్రథమంగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో 324 మంది రోగులకు వైద్య సేవలందించారు. సుమారు రూ.80 వేల విలువైన మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు ఎంవీఎస్‌డీ సుబ్బారావు, మల్లేశ్వరరావు, శివరామకృష్ణంరాజు, ఎండీ.బిలాల్, నిలోఫర్, కవిత, కె.మహేష్ వర్మ, పి.రామకృష్ణంరాజు, కె.కిరణ్, మాధవి, ఎం.శ్రీనివాస్, జె.అలేఖ్య, లయన్స్ జిల్లా రెండో గవర్నర్ ఆర్‌వీఎస్ నారాయణరాజు, అధ్యక్ష, కార్యదర్శులు కాకర్ల రాజరాజేశ్వరి, మోరా జ్యోతి రెడ్డి, నర్సింహం, బాబు, ఎండీ జక్కీ, తదితరులు పాల్గొన్నారు.

నృత్యంతో శారీరక దృఢత్వం



నృత్య సంగీత కళాకారులను సత్కరిస్తున్న విజ్ఞాన వేదిక సభ్యులు

భీమవరం (ప్రకాశంచౌక్): నృత్యం కేవలం కళ మాత్రమే కాదని, ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి ఎంతగానో ఉపయోగపడుతుందని కేజీఆర్ఎల్ కళాశాల కోశాధికారి గన్నాబత్తుల శ్రీనివాస్ అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భీమవరం వెంకట్రామ థియేటర్‌లో ప్రపంచ నృత్య దినోత్సవాన్ని నిర్వహించి, పలువురు నృత్య, సంగీత కళాకారులను సత్కరించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ 30 నిమిషాల డ్యాన్స్‌తో 130 నుంచి 250 కేలరీలు ఖర్చు అవుతాయని, ఇది అర గంట జాగింగ్‌తో సమానమని నిపుణుల అభిప్రాయమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, కళా రంజని నాటక పరిషత్ అధ్యక్షుడు జవ్వాది శ్రీనివాస్, చైతన్య భారతి నాటక పరిషత్ సభ్యులు భట్టిప్రోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ భారతదేశం నాట్యకళకు కూడా ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. అనంతరం పైడిరాజు ప్రభావతిలను సత్కరించారు. కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి సభ్యులు ఎస్‌కే చాన్‌భాషా, లింగరాజు, పులపర్తి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

‘కిశోరి వికాసం’పై శిక్షణ



పాలకోడేరు: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐసీడీపీవో వాణీవిజయరత్నం



కాళ్ల: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ స్వాతి

పాలకోడేరు: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల స్థాయిలో కిశోరి వికాసం కార్యక్రమం గురించి ఆకివీడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ వాణి విజయరత్నం అధ్యక్షతన శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోరి వికాసం కార్యక్రమం మే 2 నుంచి జూన్ 10 వరకు ప్రతి మంగళవారం, శుక్రవారం జరుగుతుందని ఏ రోజు ఏ సెషన్ చెప్పాలి, ఎవరు చెప్పాలనే విషయంపై సంబంధిత సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీడీవో రెడ్డియ్య మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ఈ కిశోరీ వికాసం సమ్మర్ క్యాంప్‌ను అన్ని డిపార్ట్‌మెంట్లు కలిసి సమన్వయంతో కలిసికట్టుగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పార్వతి, సూర్యకుమారి, తదితరులు పాల్గొన్నారు.

కాళ్లలో..

కాళ్ల: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై మండల స్థాయి శిక్షణ కార్యక్రమం మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జి.స్వాతి, మండల వైద్యాధికారి డాక్టర్ ఎస్.సునీల్ మాట్లాడుతూ కిశోరి వికాస కార్యక్రమం వారానికి రెండు రోజులు గ్రామాల్లో నిర్వహించాలన్నారు. దీనిలో భాగంగా ఆయా గ్రామాల్లో బాలికల అందరిని హాజరయ్యేలా చేసి, వారి హక్కుల రక్షణ, విద్య, ఆరోగ్యం, వంటి పలు అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సీహెచ్ హేమలత, వి.నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్యల ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): మహిళా సమాఖ్యలు తయారు చేసే తినుబండారాలు, లేసు ఉత్పత్తులకు మంచి మార్కెటింగ్ కల్పించే దిశగా అందమైన ప్రింటింగ్ డిజైన్లతో బాక్స్ ఐటమ్‌లను తయారు చేసి అందించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రింటర్స్ ప్రతినిధులను కోరారు. మంగళవారం వశిష్ఠ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అందమైన ప్రింటింగ్ డిజైన్స్‌తో ప్యాకింగ్ ఉత్పత్తులను తయారు చేసేందుకు డీఆర్‌డీఏ, ఇండస్ట్రీస్ అధికారులు, ప్రింటర్స్ అసోసియేషన్ సభ్యులతో సమావేశమై చర్చించారు. డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు, లేస్ పార్క్ మేనేజర్ కుసుమ కుమారి పాల్గొన్నారు.

ఈదురుగాలులతో తుంపర్ల వర్షం

ఆకివీడు: మండలంలోని పలు గ్రామాల్లో ఆకస్మికంగా మంగళవారం రాత్రి ఈదురుగాలులు, తుంపర్ల వర్షం కురిసింది. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పు రావడంతో రైతులు బెంబేలెత్తిపోయారు. పలు చోట్ల కల్లాల్లో ధాన్యం ఉంది. చేతికి అంది వచ్చిన పంట చేలల్లోనే ఉంది. కోతలకు సిద్ధమవుతున్న తరుణంలో ఈదురుగాలులు, తుంపర్ల వర్షంతో రైతు గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. హుటాహుటిన రైతులు ధాన్యం రాశులను టార్పాలిన్‌తో కప్పించారు. బస్తాల్లో ఉన్న ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే ప్రయత్నం చేశారు. భారీ వర్షం కురవకపోవడంతో రైతులు గట్టెక్కినట్లు అయ్యింది.

పేదలను కొట్టి పెద్దలకు పెట్టే చర్యలు తగదు



భీమవరంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నేత బలరాం

భీమవరం: ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు చెప్పే అభివృద్ధి మాటలు పేదల పొట్ట కొట్టి పెద్దలకు కట్టబెట్టేలా ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బి.బలరామ్ విమర్శించారు. భీమవరంలో మంగళవారం సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ అధ్యక్షత నిర్వహించిన వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకుల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రఘురామకృష్ణరాజు ఎమ్మెల్యేగా అధికారం చేపట్టిన తరువాత 800 మంది పేదల ఇళ్లు, దాదాపు 200 చిన్న దుకాణాలను కూల్చి పేదలను రోడ్డు పాలు చేశాడన్నారు. కాలుష్యం పేరుతో పేదల ఇళ్లను అధికార బలంతో ధ్వంసం చేస్తున్నారని దుయ్యబట్టారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ కోర్టు ఆదేశాల మేరకు ఇల్లు తొలగిస్తున్నానని బహిరంగంగా చెబుతున్న రఘురామకృష్ణరాజుకు అదే కోర్టు పేదలు ఇళ్లను కూల్చొద్దని చెప్పిన విషయం తెలియదా అని ప్రశ్నించారు. పార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి లంక కృష్ణమూర్తి మాట్లాడుతూ జిల్లాలో ఉండి నియోజకవర్గం కాలుష్యానికి కారణం బడాబాబుల పరిశ్రమలే తప్ప పేదల ఇల్లు కాదనే విషయం ఎమ్మెల్యే గుర్తించాలని హితవు చెప్పారు. బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రత్నంరాజు మాట్లాడుతూ ప్రత్యామ్నాయం చూపకుండా పేదల ఇళ్లను కూల్చడం సరికాదన్నారు. దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ మాట్లాడుతూ అతి పేదలైన యానాదుల ఇళ్లకు ముందుగా విద్యుత్ సరఫరా నిలిపివేసి ఇబ్బందులకు గురి చేసి, ఇళ్లను తొలగించడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్యక్రమంలో కోన జోసెఫ్, బోకూరి విజయరాజు, పి.పూర్ణ, అంకెం సీతారాం, కె.క్రాంతిబాబు, బి.వాసుదేవరావు, మల్లుల సీతారాం, దండు శ్రీనివాసరాజు, ఎం.రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

మేడేను జయప్రదం చేయాలి



మేడే వేడుకల పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

భీమవరం: పట్టణంలో మే 1వ తేదీన నిర్వహించే మేడే వేడుకలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు పిలుపునిచ్చారు. మంగళవారం భీమవరం తాలూకా రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ విస్తృత సమావేశంలో మేడే పోస్టర్ ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం రద్దు చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.సత్యనారాయణ, కె.సోమేశ్వరరావు, కొండయ్య, కె.సోమన్న, ఆదినారాయణ, శివ, తదితరులు పాల్గొన్నారు.

పాకా నామినేషన్‌కు తరలిన నాయకులు

భీమవరం: రాజ్యసభకు నామినేషను వేయడానికి భారతీయ జనతా పార్టీ నాయకుడు పాకా వెంకట సత్యనారాయణ మంగళవారం అనుచరణ గణంతో అమరావతి తరలి వెళ్లారు. భీమవరం బలుసుమూడిలో ఆయన గృహానికి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలి వచ్చి ఆయనకు అభినందనలు తెలిపారు. ముందుగా సత్యనారాయణ మావుళ్లమ్మ ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి అమరావతి తరలివెళ్లారు. బీజేపీ నాయకులు కోమటి రవికుమార్, కాయిత సురేంద్ర తదితరులు ఉన్నారు.

రోగులకు సామగ్రి అందజేత



రోగులకు సామగ్రిని అందజేస్తున్న వైద్యులు

కాళ్ల: మండల పరిధిలోని 20 మంది బోధకాలు వ్యాధిగ్రస్తులకు అవసరమైన సామగ్రి భీమవరం మలేరియా అధికారి కార్యాలయం నుంచి మంగళవారం వచ్చినట్లు వైద్యులు సరాబు సునీల్ తెలిపారు. రోగులకు ప్రతి ఒక్కరికీ ఒక ప్లాస్టిక్ టబ్, మగ్గు, సోప్, ఆయింట్‌మెంట్, ఒక టవల్ మలేరియా సబ్ యూనిట్ అధికారి భాస్కరరావు హెల్త్ అసిస్టెంట్ వర్మ చేతుల మీదుగా అందించినట్లు వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.